


# ఆపదలో వదలని తోడే...

"మోసపోవడం మీకు కొత్త కాదుగా! ఇంకెప్పుడండీ మీకు తెలిసొచ్చేది?" జానకికి ఆవేశమెక్కువైంది.

అభిరామ్ స్థానంలో మరొహరుంటే, భార్య అంత మాటన్నందుకు పెద్ద గొడవైపోయేదే. కాని, అతనికి కోపం రాలేదు. పైగా మందహాసం అతని పెదవులపై మెరిసింది. అది ఆమె దృష్టిని దాటిపోలేదు.

"పైగా ఆ నవ్వెందుకు?" చురుక్కు మంది తనే మళ్ళీ.

పరిశీలనగా చూశాడు అభిరామ్ భార్య మొహంలోకి. పదేళ్ళు దాటని పసి పాపను తలపిస్తుంది జానకి.

"పసితనంలో నువ్వెలా ఉండేదానివో ఊహించుకుంటున్నా" చిరునవ్వు చెరగలేదు - అభిరామ్.

"చాల్లెండి!" గిరుక్కున వెనక్కి తిరిగింది, ఆవేశం సడలి, ఎక్కడ తేలికైపోతానోనని - ఆమె.

వెనక్కి తిరిగిన ఆమె భుజాలపై చేతులు వేశాడు.

"అబ్బ! వదలండి!" సున్నితంగా విడిపించుకోజూచింది.

"జానకీ! నువ్వుగాక నన్నెవ్వరర్థం చేసుకుంటారు చెప్పు?" అతని ఆర్ద్రత సూటిగా ఆమె గుండెను తాకింది.

అది ఆమె కళ్ళలో చెమ్మగా ప్రతిఫలించింది. విడిపించుకోవాలన్న అతని చేతిని గట్టిగా పట్టుకుంది. కొద్ది క్షణాల పాటు ఇద్దరూ మాట్లాడలేకపోయారు.

"అది కాదండీ! మీరు చేసేది మంచిపనే. కాని దానికి గుర్తింపు లేనప్పుడు..."

"వంటయిందా?" జానకిని అడ్డుకున్నాడు అభిరామ్.

"ఊ!" దానికీ, దీనికీ గల బాదరాయణ సంబంధమేమిటో అర్థంకాలేదు ఆమెకు.

"ఇలారా!" మంచం మీద కూర్చుంటూ, తన ప్రక్కన కూర్చోబెట్టాడు ఆమెని. "చెట్లు ఏ గుర్తింపు కోరి ఫలాలనిస్తాయి? పాలిచ్చే గోవులకు ఏమి గుర్తింపుంది? నదులు..."

"ఉండండీ! భర్తృహరిలాంటి మహాపురుషులు గుర్తించారు కాబట్టే వందలాది సంవత్సారాల నుండీ వాటి పరోపకార గుణాన్ని గానం చేస్తున్నాం. ఇలా పద్యాల ద్వారా గుర్తు చేసుకుంటున్నాం."

ప్రశంసా పూర్వకంగా చూశాడు అభిరామ్.

వాదనలో తనది పైచేయి కావడం ఆమెకు ఒకింత గర్వాన్ని కలిగించింది. ఆమె భుజాలు ఉప్పొంగాయి. కళ్ళలో మెరుపు.

"మరి ఆ గుర్తింపు లభించాలనే అవన్నీ పరోపకారం చేశాయా?"

అతనలా అడుగుతాడనుకోలేదు. నీళ్ళు నమలసాగింది.

"ఇదీ అలాంటిదే. ఎన్నో జన్మల పుణ్యఫలంగా ఈ జన్మ ప్రాప్తించింది. గత జన్మలోని సంస్కారలేశం ఈ జన్మలో ఎంతో కొంత మంచిపని చేసే అవకాశం కల్పిస్తున్నది. 'పెద్ద కొండపైనుండి దూకిచావడం, అగ్నిలోపడి కాలిపోవడం, పాముని నోట్లో వేలుపెట్టి చావడం కూడా మంచిదే. మంచి గుణాల్ని వదులుకోవలసి వస్తే' - అంటాడు భర్తృహరి మరోచోట. నిజానికి మనం ఈ కాలంలో ఎవరికైనా చేస్తున్నది ఉపకారం కాదు. కేవలం సహకారం. మనుషులమయ్యాక ఆ మాత్రమైనా చేయకపోతే ఎలా?"

ఆయనలాగే మాట్లాడతారని ఆమెకు తెలుసు. 'తనను సమర్థిస్తున్నట్టే మాట లాడి చివరికిలాంటి హితోపదేశం మొదలు పెట్టాడు. ఈయనగారితో వాదించడమే బుద్ధితక్కువ.' మనసులోనే అనుకుంది జానకి.

ఇంతలో ట్యూషన్‌కెళ్ళిన పిల్లలొచ్చేశారు విరించి, విపంచీ. ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరైపోతున్నప్పుడు పలకరించే చిరుజల్లుల్లా. ఆ వాతావరణం క్షణంలో మారిపో యింది. (ఐదో తరగతి విరించి ఎంత మౌనంగా ఉంటాడో మూడో తరగతి విపంచి అంత అల్లరి చేస్తుంది. దాని మాటల్లో ఓ కొత్త ప్రపంచం ఆవిష్కృతమౌతుంది. దాని అమాయకత్వాన్ని విరించి తన మేధాశక్తితో ఖండిస్తూ, విశ్లేషిస్తూండటం కూడా ముద్దుగొలుపుతూ ఉంటుంది.)

'తనకున్నదాంట్లో ఇతరులకు సహకరించాలి!' అంటాడు అభిరామ్. 'తనకు మాలిన ధర్మం లే' దంటుంది జానకి. తరచూ తెరలేచే ఈ సంవాదానికి గంట క్రితమే నాంది జరిగింది.

ఈశ్వర్ అనబడే ఒకానొక స్నేహితుడు ప్లస్ అతని సహోద్యోగి అర్జెంటుగా రెండువేల రూపాయలు కావాలంటున్నాడని ఆఫీసు నుండి వస్తూనే కూడా వెంటబెట్టుకొని వచ్చాడు అభిరామ్. ఆ శాల్తీ మొహం చూస్తేనే 'దగాకోరు' అనిపిస్తోంది జానకికి. మూణ్ణెల్లక్రితం ఇరవై మూడో తారీకున హడావుడిగా ఇలాగే వెంటబెట్టుకొచ్చి అయిదు వందలు చేతిలో పెట్టాడు. ఫస్టుకిస్తానన్న ఆ ఘనుడు ఇంతవరకూ ఇవ్వకపోగా మళ్ళీ రెండువేలకు ఎసరుపెట్టాడు. "నెలమీద అవీ, ఇవీ కలిపి ఇస్తాడట" అంటూ ఆయనగారి వకాల్తా.

వచ్చినవాడి ముందు సంస్కారం కోల్పోవడం చేతగాక, భర్తమాట నిలబెట్టక తప్పలేదు ఆమెకి. కాని ఆ డబ్బు బావిలో వేసిన రాయిలాంటిదేనని ఆమె మనసు హెచ్చరిస్తూంటే భర్తతో వాదనకి దిగింది.

ఫలితం మామూలే. భర్త మంచితనం, అమాయకత్వం, ప్రేమ ఆమెనెప్పుడూ ముందుకు సాగనీయవు. అతని వెంటనడవటంలోనే ఆమెకానందం అవుతుంది చివరకు.

❋ ❋ ❋

"ఆపదల్లో విడువకుండా ఉండటం, అవసరానికి ఆదుకోవడం... ఫ్రెండ్షిప్ లక్షణాలు గురూ!" మందుకి సోడా జోడిస్తూ అన్నాడు ఈశ్వర్.

"ఏందిరో! ఈ రోజు కిక్కుతల కెక్కకుండానే సూక్తులు వల్లిస్తున్నావ్? ఇంటి వద్దే కొంత లాగించేసి వచ్చావా?" సిగరెట్ వెలిగిస్తూ చూశాడు ఈశ్వర్ వంక రాజు.

ఈశ్వర్ ఏదో అనేలోపే అందుకున్నాడు - "ఏంది బై, అంత మాటనేశావ్? మీరు నాకు నిజమైన మిత్రులు." నొచ్చుకున్నట్టు అన్నాడు. నిజంగానే వాళ్ళు ముగ్గురూ మం(దు)చి మిత్రులు మరి.

"మరి, ఆ అభిరామ్ గాడు?" మొదటి పెగ్గు గొంతులోకి ఒంపుకున్నాడు రాజు.

"పనిముట్టు" తడుముకోకుండా అనేశాడు ఈశ్వర్.

అందరూ నవ్వారు గొల్లున.

"అయినా, వాడ్నిలా వాడుకోవడం పాపం రా!" అనంత్ సానుభూతిలో వ్యంగ్యం కూడా సమపాళ్ళలో ఉంది.

"ఏది పాపం గురూ? కోడిని అపురూపంగా పెంచుకుంటాం. గుడ్డు పెట్టగానే ఆమ్లెట్టేసేసుకుంటామా లేదా? ఇదీ అంతే. నమ్మించోటనే మోసం చేయాలి. ఇంకా చెప్పాలంటే నమ్మించి మోసం చేయాలి." అనుపానంగా మసాలా పప్పును నోట్లో వేసుకుంటూ గీతోపదేశం చేస్తున్న లెవెల్లో చెప్పాడు ఈశ్వర్.

"ఒరేయ్! ఎవర్నీ మళ్ళీ మళ్ళీ మోసం చేయలేవురా!" రెచ్చగొడుతున్నట్టు - రాజు.

"ఇప్పటికి రెండు సార్లయింది గురూ! తల్చుకుంటే ఇంకోసారి కూడా చెయ్యగలను" నిజంగానే రెచ్చిపోయాడు ఈశ్వర్.

"ఛాలెంజ్?" సవాల్ విసిరాడు రాజు.

"ఛాలెంజ్ గురూ! ఈ రోజు ఫస్టుగదా! ఈ రోజే అభిరామ్‌గాడి దగ్గర మరో వెయ్యి పట్టుకొస్తా, పాతబాకీ ఒక్కపైసా ఇవ్వకుండానే" రాజు సవాల్‌ని స్వీకరిస్తున్నట్టు ఈశ్వర్.

"వెయ్యా?" తేలిగ్గా తీసిపారేస్తూ అన్నాడు రాజు.

"దమ్ముంటే అయిదువేలు పట్టుకురా చూద్దాం!" మూడో పెగ్గు గొంతులోకి ఒంపుకున్నాడు షార్ప్‌గా.

"ఒకే! డన్! కానీ పందెమేంటో చెప్పు?" పంతంగా ఈశ్వర్.

"ఒరేయ్! ఈ పనికి మాలిన ఛాలెంజ్‌లు వదిలేసి హాయిగా ఎంజాయ్ చెయ్యండిరా!" పరిస్థితి హద్దుదాటుతున్న సంగతి గ్రహించి రాజుకుంటున్న నిప్పు మీద నీళ్ళు చల్లే ప్రయత్నం చేశాడు అనంత్. కాని, అది అగ్నికి ఆజ్యంలా పని చేస్తుందని ఊహించలేకపోయాడు.

"నో! ఇదేదో తేలాల్సిందే గురూ!" మొండిగా - ఈశ్వర్.

"ఒకే! నువ్వు అభిరామ్ వద్ద ఐదువేలు - ఇప్పటికిప్పుడు తెగల్గితే, దసరా నుండి దీపావళి వరకు నీకు మందు ఫ్రీ..."

ఏదో అనబోతున్న ఈశ్వర్ నడ్డుకుంటూ మళ్లీ అన్నాడు. "ఒకవేళ ఐదువేలకు ఒక్కపైసా తక్కువయినా......." రాజు మాట పూర్తికాలేదు.

"దసరా నుండి దీపావళి వరకు నీకు ఫ్రీ!" అప్పజెప్పినట్టు అనేశాడు ఈశ్వర్.

"ఓ.కే." అంటే "ఓ.కే." అనుకున్నారిద్దరూ.

"నన్ను మాత్రం ఈ లంపటం నుండి ఫ్రీ చేయండిరా. మీ ఛాలెంజ్ పూర్తయ్యే దాకా నేను పార్టీకి రాను." సమాధానం కోసం ఎదురుచూడకుండా గ్లాసులోనిదంతా గొంతులోకి ఒంపుకొని అక్కడినుండి బయలుదేరాడు అనంత్.

ఇద్దరూ కలిసి స్కూటర్‌పై అభిరామ్ ఇంటివైపు సాగారు.

దసరా పండుగకి కొత్తబట్టలు కొనేందుకు బయలుదేరబోతూన్న అభిరామ్ వాళ్ళకి గుమ్మంలో ఎదురయ్యాడు ఈశ్వర్.

'అన్నమాట ప్రకారం డబ్బులిచ్చేందుకు వచ్చాడ'నుకున్నాడు అభిరామ్.

అతడెదురుకావడం అపశకునం అనిపించింది జానకికి.

"అన్నా! అర్జెంటుగా ఓ వైట్ పేపరివ్వు" కూర్చోనైనా కూర్చోకుండానే అడిగాడు ఈశ్వర్.

"ఎందుకూ?" అయోమయంగా అడిగాడు అభిరామ్.

"నీకు దండం పెడతానన్నా! దయచేసి ఒక తెల్లకాగితం...ప్లీజ్!" చేతులు జోడించాడు. ఏడుపొక్కటే తక్కువ.

"సరే! ముందు కూర్చో!" వాళ్ళు కూర్చోగానే భార్యను టీ తెమ్మని కేకేశాడు అభిరామ్. అది విననట్టే ఉండిపోయింది జానకి.

విరించి పేపరు, పెన్నూ తెచ్చి యిచ్చాడు.

జానకికి కంపరం పుడుతోంది.

ఆ కాగితం తీసుకొని గబగబా నాలుగులైన్లు గీసి ఇచ్చేశాడు ఈశ్వర్.

"ఏమిటిది?" పరిశీలనగా చూశాడు అభిరామ్. అది శాలరీ ఆథరైజేషన్ లెటర్.

"అన్నా! నేను తప్పు చేశాను. అబద్ధమాడాను. అందుకే దేవుడు నాకు తగిన శిక్ష వేశాడు. ఈ రోజు ఖచ్చితంగా మీ డబ్బులు ఇచ్చేస్తానని చెప్పాను..." అతని కళ్ళ నుండి నీళ్ళు టపటపా రాలాయి.

ఆ సీన్ చూసి నోరు తెరిచాడు రాజు.

'ఇదంతా డ్రామా!' లోపలి గదిలోంచి వింటూ పళ్ళు నూరుతోంది జానకి.

అయోమయంగా చూస్తున్నారు పిల్లలు.

"మీ ఉసురు తగిలిందన్నా! మా వెంకట్..." దుఃఖంతో అతని గొంతు పూడు కొనిపోయింది. ఎలాగో పెగల్చుకొని పూర్తిచేశాడు. "వెంకట్‌కి యాక్సిడెం... టయ్యిం...ది." భోరుమన్నాడు.

ఒక్క క్షణం అక్కడ వాతావరణం స్తంభించినట్లైంది.

"అర్జెంటుగా అయిదువేలు కావాలి. లేకపోతే వాడు... వాడు నాకు దక్క... డన్నా!" మొహాన్ని చేతులతో కప్పుకొని ఏడ్చేశాడు.

"డోంట్ వర్రీ ఈశ్వర్! ఐ విల్ హెల్ప్ యు!" తనకే యాక్సిడెంటయినట్టు బాధపడ్డాడు అభిరామ్.

బట్టలు కొనుక్కునేందుకు పర్సులో పెట్టుకున్న ఆరువేలలోంచి అయిదు వేలు తీసివ్వక తప్పలేదు జానకికి. కాని ఈసారి బాధనిపించలేదు. ఈశ్వర్ కొడుక్కి (వెంకట్‌కి) ఏ ఆపదా కల్గకూడదని మనసులోనే భగవంతుడ్ని కోరుకుంది.

డబ్బు చేతిలో పడగానే కాళ్ళకు దండం పెట్టి వెళ్ళిపోయాడు రాజుతో కూడా ఈశ్వర్.

* * *

దసరా నుండి దీపావళి వరకు మూడు ఆదివారాలు, మూడు బుధవారాలు మొత్తం ఆరు మందుపార్టీలు అనుపానాలతో పాటు అన్నీ రాజు ఇంట్లోనే. ఆ మహాప్రస్థానం ప్రారంభమైంది.

"పందెం గెలవడం పక్కనబెట్టురా! ముందు నీ యాక్టింగ్‌కివ్వాలిరా అసలు పార్టీ. సినిమాల్లో ట్రైజెయ్యరాదూ! తిరుగుండదు." మొదటి పార్టీలో రాజు ప్రశంసలజల్లులో - ఫుల్లుగా మునిగాడు ఈశ్వర్.

ప్రస్థానం రెండో మజిలీలో రాజు భార్య అనుపానాలేవీ చేసిపెట్టలేదు. కష్టంగా మందు మింగినట్టు మింగాడు మందు.

మూడో మజిలీ...

ఈశ్వర్, రాజువాళ్ళ ఇంట్లోకి ఎంటరవుతుండగానే గబుక్కున లోపలికెళ్ళి పోయింది వాళ్ళావిడ - చూడకూడనిది చూసినట్టు మొహంనిండా అసహ్యం ప్రదర్శిస్తూ.

ఈశ్వర్ పిలుపు విని బెడ్‌రూం దాటుతున్న రాజుతో అంది వాళ్ళావిడ. "ఏం మనుషులండీ! ఫ్రీగా వస్తే ఫినాయిలయినా తాగేసేట్టున్నారే!" అంది. ఈశ్వర్‌కి వినబడాలనే.

"పిచ్చిదానా! ఇది కలికాలం! ఆకలి కాలం! పుణ్యానికొస్తే పురుగుల మందు తాగటానికైనా సిద్ధమే." వెటకారంగా అంటూ ఈశ్వర్ మొహం చూసి నవ్వాడు. ఆ నవ్వు ఓ విపత్కర పరిణామానికి దారితీస్తుందని అతనికి మాత్రం అప్పుడు తెలియదు.

* * *

"వ్వాట్? ఈశ్వర్ ఆస్పత్రిలో ఉన్నాడా?" నమ్మలేనట్టు అడిగాడు కొలీగ్ శ్రీనివాసరావుని అభిరామ్.

"అవునండీ! నేనిప్పుడక్కడ్నించే వస్తున్నాను. మా నైబర్ రాజూ, అతనూ తలలు పగిలేలా కొట్టుకున్నారు. ఇద్దరూ ఒకే ఆస్పత్రిలో ఉన్నారు. ఈశ్వర్ తలకి బలంగా తగిలింది గాయం. పధ్నాలుగు కుట్లు పడ్డాయి." రావు వివరణలో సానుభూతి లేదు. సమాచారం మాత్రమే ఉంది.

"ఎలా జరిగింది?" ఆస్పత్రికి బయలుదేరేందుకు సిద్ధమవుతూ అభిరామ్.

"ఎలా జరిగిందో చెబితే మీరు ఆస్పత్రి ఛాయలక్కూడ వెళ్ళలేరులెండి." ప్రస్తావనగా అన్నాడు రావు.

అసలు సంగతి తెలుసుకునే ఆరాటంతో తర్వాత అతను మాట్లాడే మాటల కోసం ఎదురుచూస్తున్నాడు అభిరామ్.

"ఏముందీ మా పక్కింటోడు రాజూ, ఈ ఈశ్వర్‌గాడు మందు ఫ్రెండ్స్. గత పదిహేనురోజులుగా వీడు ఆ రాజుగాడింట్లో గ్రంథం నడిపిస్తున్నాడు. ఏదో పందెం లో నెగ్గితే వీడికి దీపావళి దాకా వాడు మందు పోయిస్తానన్నాట్ట. నిన్న రాత్రి ఎక్కడో తేడా వచ్చినట్టుంది. మాటా మాటా పెరిగి ఒకణ్ణొక్కడు తన్నుకునే దాకా వచ్చారు. కోపంలో ఈశ్వర్‌గాడు సినిమా స్టైల్లో బాటిల్ పగలగొట్టి వాణ్ణి పొడిచేందుకెళ్ళాడు. వాడు పక్కనే ఉన్న క్రికెట్ బ్యాటందుకొని వీడి తలమీద ఒక్కటేశాడు. ఇంకా నయం! బతికాడనుకో!"

"సరే, సర్లే! అవన్నీ తర్వాత. ముందు హాస్పిటల్ కెళ్దాం పద" అంటూ పర్మిషన్ కోసం సూపరిండెంట్ వద్దకి వెళ్ళాడు అభిరామ్.

❋ ❋ ❋

"అన్నా!" తనను పరామర్శించడానికొచ్చిన అభిరామ్‌కు బెడ్ మీద నుండే చేతులెత్తి దండం పెట్టాడు ఈశ్వర్. అతని కళ్ళు ధారాపాతంగా వర్షిస్తున్నాయి.

బెడ్ పక్కనే ఉండి గమనిస్తున్న భార్య రమ్య, కొడుకు పదేళ్ళ వెంకట్, ఈ దృశ్యాన్ని ఆశ్చర్యంగా చూస్తున్నారు. 'కట్నం తక్కువ తెచ్చా'వని భార్యను, కన్నబిడ్డ అని చూడకుండా వెంకట్‌నూ ఏడ్పించడమే గాని ఏడవటం తెలియని ఈశ్వర్ దుఃఖం వాళ్ళకు నమ్మశక్యంగా లేదు. కాని, ఆ దుఃఖం నిజం. అది హృదయ తంత్రుల్ని కోసుకుంటూ పలుకుతున్న జీవనరాగం.

"డోంట్‌వర్రీ ఈశ్వర్! డాక్టరు గారితో నేను మాట్లాడాను. భయం లేదన్నారు. రేపు డిశ్చార్జి కావచ్చు. డబ్బులేమైనా కావాలా?" అనునయంగా అడిగాడు.

"వద్దు అన్నయ్యగారూ! జరిగినదంతా తెలిసింది. కొడుకుకి యాక్సిడెంట య్యిందని తాగుడుకోసం అబద్ధం చెప్పిన ఈ మనిషికి తగిన శాస్తి చేశాడా దేవుడు. నిజంగా నా బిడ్డకే ఆపద కల్గి ఉంటే..." వెంకట్‌ని గుండెలకి హత్తుకొని బావురు మందా తల్లి.

'ఎంత తేడా? అవసరం లేకున్నా తను ఏడ్పునటించి, అతని అవసరాల్ని సైతం కాలరాచి డబ్బు తన్నుకుపోయిన నాకు, తనెంత ఇబ్బందుల్లో ఉన్నా వాటి గురించి ఆలోచించకుండా నాకోసం సాయంచేస్తానంటున్న అభిరామ్‌కూ...' మనసులోనే అనుకుంటూ. జేబులో చేయిపెట్టబోతున్న అభిరాం చేయిపట్టుకు న్నాడు ఈశ్వర్.

"అన్నా! ఈ డబ్బే నన్నింతటి కష్టాల్లో పడేసింది. వద్దన్నా! ఇప్పటికే నీ మంచితనాన్ని, అమాయకత్వాన్నీ ఉపయోగించుకుని నిన్ను మోసంచేశాను. అందుకే దేవుడు నాకీ శాస్తి చేశాడు. నీడబ్బవసరం లేదు. నీలాంటి ఉత్తముడు నా స్నేహం విడవకుంటే చాలు!" మళ్లీ చేతులు జోడించాడు.

"డోంట్ బీ సిల్లీ! అయామ్ యువర్ ఫ్రెండ్ ఫరెవర్!" అతని చేతుల్ని తన చేతుల్లోకి తీసుకొని నొక్కి వొదిలాడు అభిరామ్. సగం బాధ తగ్గినట్టయింది ఈశ్వర్‌కి. ఆ తర్వాత యథార్థమంతా చెప్పేశాడు అభిరామ్‌కి. "నేను మాట నిలబెట్టు కోకపోయినా మూడోసారి కూడా నాకు సాయం చేయాలని నీకెందుకనిపించింది?" వెళ్ళబోయే ముందు అభిరామ్‌ని అడిగాడు.

"ఏమో! నువ్వెప్పుడూ అబద్ధమాడుతున్నట్టు నాకనిపించలేదు. నాకు చేతనైనంత వరకు ఒకరికి సాయం చేయడమే నాకు తెలిసింది" సింపుల్‌గా అంటూ చిరునవ్వు నవ్వాడు అభిరామ్ ఎప్పటిలాగే.

సంశయం పూర్తిగా వదల్లేదు ఈశ్వర్‌కి. తటపటాయిస్తూనే ఓ మాటడిగే సాహసం చేశాడు "అన్నా! నాలాంటి వాళ్ళకు సాయం చేస్తూంటే నీ ఆర్థిక పరిస్థితి..."

"ఈశ్వర్! నా దృష్టిలో అందరూ మంచివాళ్ళే. నేను చేసిన సహాయమెప్పుడూ నిష్ఫలం కాలేదు. ఏడాది క్రితం నావద్ద డబ్బు తీసుకొని, ఆపై నెల రోజులకే ట్రాన్స్‌ఫరై వెళ్ళిన అటెండర్ జాఫర్ - పనిగట్టుకొని నిన్న పదివేల రూపాయలూ తెచ్చిచ్చాడు. మనం ధర్మాన్ని పాటిస్తే మనల్ని ధర్మం రక్షిస్తుందంటే ఇదే మరి." ఎంతో సాధారణ విషయం చెబుతున్నట్టు అభిరామ్.

"అన్నా! మనుషుల్లో దేవుడు..."

"అదే పిచ్చి ఆలోచన" ఠక్కున అడ్డుకున్నాడు మళ్ళీ.

"అసలు మనిషే దివ్యాత్మ స్వరూపం. మంచిని ఆచరించు. ఎదుటివాళ్ళలో మంచిని దర్శించు. మంచిని ప్రేమించు. మంచి జరుగుతుంది. అంతే!"

భగవంతుడే ఆ మాటలంటున్నట్టనిపించింది ఈశ్వర్‌కి.

**(దీపావళి ప్రత్యేక సంచిక 2003 జాగృతి- వారపత్రిక)**